క్లుప్తంగా

రుణాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లూరు: మండలంలోని అర్హత కలిగిన బీసీలకు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాల ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో హనుమంతురావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ద్వారా 2024–25 సంవత్సరానికి అర్హత కలిగిన వెనుగబడిన తరగతుల వారు ఓబీ ఎంఎంఎస్ పోర్టల్లో జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రైవేట్ పాఠశాల తనిఖీ



పరిసరాలు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు

దర్శి: పట్టణంలోని సంస్కృతి స్కూల్లో ఫుడ్ పాయిజన్ జరగలేదని, విద్యార్థులు సాధారణ జ్వరాలతో మాత్రమే బాధపడుతున్నారని డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక సంస్కృతి స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో వసతులు, పరిసరాలు, తాగునీరు, ఆహారం, వంటగదిని పరిశీలించారు. 30 మంది విద్యార్థులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వచ్చారన్నారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించగా ఐదుగురికి మాత్రమే జ్వరాలు, జలుబు కనిపించాయని చెప్పారు. ఎలాంటి విషజ్వరాలు ఉన్నట్లు నిర్ధారణ కాలేదని డీఎంహెచ్ఓ చెప్పారు. ఫుడ్ పాయిజన్ జరిగిందనేది అపోహ మాత్రమేనని ఆయన కొట్టిపారేశారు.

అనారోగ్యంతో వృద్ధుడి మృతి

- మృతుడు రైల్వే పనులకు వచ్చిన కూలీ



నరసింహారావు మృతదేహం

దర్శి: అనారోగ్య కారణంగా రైల్వే కూలీ మెరుగుపల్లి నరసిహారావు (60) మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా మధిర మండలం కంభంపాడు గ్రామానికి చెందిన నరసింహారావు రైల్వేస్టేషన్‌లో పనులు చేసేందుకు వచ్చాడు. రైల్వేలో కూలి పనులు చేసుకుని జీవనం సాగించే నరసింహారావు 3 గంటల ప్రాంతంలో ప్లాట్‌ఫారంపై పడి మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేసి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఏఎస్సై రాంబాబు మృతదేహాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. సాధారణ మరణం కావడంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు.

ఉద్యాన పంటలు సాగు చేసుకోవాలి

- జిల్లా ఉద్యాన శాఖాధికారి గోపీచంద్

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల రైతులు అధిక ఆదాయం వచ్చే పండ్ల తోటలపై మక్కువ పెంచుకోవాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి వై.గోపీచంద్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని కవలకుంట్లలో ఉన్న పలు ఉద్యాన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్ల తోటలు ఉన్న రైతులకు నీటి కుంటలు మంజూరు చేస్తామని చెప్పారు. ఏప్రియల్ తర్వాత పాత బత్తాయి, నిమ్మ తోటలను బాగు చేసుకునేందుకు పునరుద్ధరణ పథకం అందజేస్తామని తెలిపారు. మిర్చి తోటల్లో వర్షాలతో తాలు కాయలు వచ్చాయని, తాలు కాయలను ప్రత్యేకంగా ఆరబోసుకోవాలని చెప్పారు. మిర్చిలో నల్ల తామర పురుగుతో రైతులకు బాగా నష్టం జరిగిందని, మార్కెట్ రేటు కూడా ఆశాజనంగా లేకపోవడంతో రైతులు నిరాశతో ఉన్నారని, ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. రైతులు విచక్షణ రహితంగా పురుగు మందులు వాడకం తగ్గించుకోవాలని సూచించారు. ఆలా వాడితే మున్ముందు భూమి నిస్సారంగా మారే పరిస్థితి వస్తుందన్నారు. సాగు చేసిన ప్రతి రైతు పంటను ఈ–క్రాప్ నమోదు చేసుకుంటేనే పంట బీమా వర్తిస్తుందని తెలిపారు. ఉద్యాన శాఖ ద్వారా పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా రైతులు అభివృద్ధి చెందాలని సూచించారు. పథకాల గురించి సమీపంలోని గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకుల ద్వారా తెలుసుకోవాలన్నారు. గోపీచంద్ వెంట ఉద్యానశాఖాధికారి ఆదిరెడ్డి ఉన్నారు.



పండ్ల తోటను పరిశీలిస్తున్న గోపీచంద్

హెల్మెట్ పెట్టుకో.. ప్రాణాలు నిలుపుకో!

- హెల్మెట్‌ల వాడకంపై అవగాహన ఉండాలి
- యువకులే ప్రమాదాలకు గురవుతున్నారంటున్న పోలీసులు



యువకులకు హెల్మెట్లపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై మహేష్

పెద్దదోర్నాల:

హెల్మెట్ వాడకంపై పోలీసులు వాహనదారుల్లో అవగాహన కల్పిస్తున్నారు. దీంతో మండల వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు జోరందుకున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన, తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుల్లో ఎక్కువ శాతం ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వారే. హెల్మెట్ వాడకపోవటం వల్లే మరణాల రేటు పెరుగుతోందని మండలంలో పోలీసులు యువకులకు అవగాహన కల్పిస్తున్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించని వారిపై ఎడాపెడా కేసులు పెట్టే పోలీసులు వినూత్న రీతిలో అవేర్‌నెస్ కల్పిస్తున్నారు. హెల్మెట్ పెట్టుకుని వారికి దాని వాడకంపై అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలై బ్రెయిన్ డెడ్ కారణంగానే చనిపోతున్నారని అవగాహన కల్పిస్తున్నారు. దీంతో పాటు హెల్మెట్ ధరించని వారితో పొల్యూషన్, ఇన్సూరెన్స్ డబ్బులను సైతం కట్టించేలా చర్యలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ఒక్క చలానా కూడా లేని వారికి ఏదో ఒక బహుమానం అందించేలా చర్యలు చేపడున్నారు. దీంతో పాటు రోడ్డు భద్రత వారోత్సవాలపై ప్రతి నెలా ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలోని నటరాజ్ సెంటర్, శ్రీశైలం రోడ్డు, గుంటూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తూ ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించని వారిపై చలాన్లు వేసి ఇబ్బంది పెట్టడం తమ లక్ష్యం కాదని, వాహనదారుల్లో మార్పు తెచ్చేందుకు హెల్మెట్ కొనిపించే ప్రయత్నం చేస్తున్నామంటున్నారు. రాష్ట్రంలో ఎక్కువ శాతం యువకులే ప్రమాదాల బారిన పడుతున్నారని పోలీసులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో ఏటా రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 6 వేల మంది వరకు చనిపోతున్నారు లేదా గాయపడుతున్నారని పేర్కొంటున్నారు. హెల్మెట్ వాడకుంటే ఒక కుటుంబమే నష్టపోతుందని, వారి జీవితాల్లో సంపాదన పరులను కోల్పోవాల్సి వస్తుందని పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కువ శాతం 21 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల లోపు వయసున్న వారే ప్రమాదాలకు గురవుతున్నారని, వీరిలో 60 శాతం మంది ద్విచక్ర వాహనాల ప్రమాదాల వల్లే గాయపడుతున్నారని పోలీసులు పేర్కొంటున్నారు.

హెల్మెట్ వాడితే ప్రాణాలు నిలుపుకోవచ్చు



హెల్మెట్ వాడితే ప్రమాదాల నుంచి బయట పడి ప్రాణాలు కాపాడుకోవచ్చు. మండల పరిధిలో ఎక్కువ శాతం ఘాట్ రోడ్లు ఉన్నాయి. దీంతో పాటు ఆయా రోడ్లు ఎక్కువగా మూల మలుపుల్లో ఉండటంతో ప్రమాదాల జరిగే అవకాశం ఉంది. హెల్మెట్‌లు పెట్టుకొని ప్రయాణాలు చేస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చు.

– మహేష్, ఎస్సై, పెద్దదోర్నాల

ఉత్తమ సేవలే లక్ష్యంగా పనిచేయాలి

- డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు



మందుల వివరాల బోర్డును పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు

కురిచేడు: ప్రతి ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ప్రజలకు ఉత్తమ సేవలందించడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం ఉదయం పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం ప్రాంగణం ఆహ్లాదకర వాతావరణంలో ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. ఆరోగ్య కేంద్రంలోని ప్రతి గదిని ఆయన పరిశీలించారు. పేషెంట్లను పరీక్షించి ఆరోగ్య పరిస్థితులు, అందుతున్న వైద్యసేవల గురించి విచారించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రతి రోగి పట్ల సిబ్బంది ప్రేమతో వ్యవహరించి చికిత్స అందించాలన్నారు. అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా అందిస్తున్నామని, మందులు కూడా అందిస్తూ ప్రతి రోగికి వారి రోగం కుదుట పడే వరకు సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి రోగి ఆరోగ్య పరిస్థితి తెలిపే విధంగా ఎలక్ట్రానిక్ హెల్త్ కార్డు, అబా కార్డు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో ఓపీ పెరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అత్యవసర మందులు అన్ని ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచామని చెప్పారు. ప్రతి పంచాయతీ పరిధిలో ఇంటింటా సర్వే నిర్వహించి క్యాన్సర్ పరీక్షలు చేయిస్తున్నట్లు తెలిపారు. క్యాన్సర్ పేషెంట్లను గుర్తించి వారికి పూర్తిగా వ్యాధి తగ్గే వరకు ఉచితంగా వైద్య సేవలు, మందులు అందజేస్తున్నట్లు వివరించారు. పిల్లల్లో ఉన్న లోపాలను ముందుగా గుర్తించేందుకు పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. బాలికల్లో, గర్భిణుల్లో రక్తహీనతను గుర్తించే పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులతో పాటు ఇంజెక్షన్లు కూడా వేస్తున్నట్లు చెప్పారు. ప్రతి విలేజ్ క్లినిక్‌లో బీఎస్సీ నర్సింగ్ చదివిన వారిని నియమించినట్లు తెలిపారు. మహిళలు వారిని సంప్రదించి వైద్యసేవలు పొందాలన్నారు. గర్భిణులు, బాలింతలకు వైద్యశాలకు వెళ్లి వచ్చేందుకు 108, తల్లి,బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నట్లు తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ఆపరేషన్ థియేటర్‌ను ఉపయోగించుకుని అక్కడే ఆపరేషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ కచ్చితంగా దాన్ని ఉపయోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. గతంలోలా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయటం లేదని, ఆడ పిల్లల శాతం తక్కువగా ఉన్నందున ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించే అన్ని వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు కోరారు. వైద్యాధికారి పి.ప్రవీణ్, ఆప్తాల్మిక్ అధికారి బీజేఎస్ హెరాల్డ్, డీపీఎంఓ ఎస్వీ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెడుతున్న చంద్రబాబు

పెద్దారవీడు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా సీఎం చంద్రబాబునాయుడు కాలయాపన చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నాడని వైఎస్సార్ సీపీ జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు వెన్నా శివకృష్ణారెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పశ్చిమ ప్రాంతం వెనుకబడిందని, చాలా అభివద్ధి చేయాల్సి ఉందని భరోసా ఇచ్చారని, మార్కాపురం జిల్లా చేస్తానని, వెలుగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందించి ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలు, రైతులకు తాగు, సాగు నీరు అందించి సస్యశామలం చేస్తామని, మెడికల్ కళాశాల పూర్తి చేస్తానని బహిరంగ సభలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇటీవల కాలంలో కూడా మార్కాపురం, దోర్నాలకు మంత్రులు వచ్చినప్పుడు వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని, మార్కాపురం జిల్లా చేసేది, కళాశాల పూర్తి చేసేది తామేనని బహిరంగంగా సమావేశాల్లో చెప్పకుంటున్నారని తెలిపారు. దాదాపు ఏడు నెలలు అవుతున్నా పశ్చిమ ప్రాంతానికి ఇప్పటి వరకు కూటమి నేతలు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ ఇంత వరకు అమలు చేయలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా అట్టర్ ఫ్లాప్ అయ్యారన్నారు. బాబు ష్యూరిటీ–భవిష్యత్ గ్యారంటీ అంటూ ప్రచారం నిర్వహించి సూపర్ సిక్స్ అంటూ రైతులు, మహిళలు, విద్యార్థులను మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్నారని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను నేరవేర్చలేక కుంటి సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూ, ఆర్థిక పరిస్థితి మెరుగుపడిన తర్వాత పథకాలు అమలు చేస్తానంటూ చెప్పడం సీఎం నారా చంద్రబాబునాయుడు మరోసారి మోసానికి తెరతీశారన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేశారని గుర్తు చేశారు. ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు, చంద్రబాబునాయుడు పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని గమనించాలని శివకృష్ణారెడ్డి కోరారు.

దళిత యువకుడిపై దాడి



ముఖంపై గాయాలు



వై.పాలెం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అశోక్

పుల్లలచెరువు: దళిత యువకుడిపై కొందరు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ సంఘటన మండలంలోని మానేపల్లిలో మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు.. మానేపల్లి గ్రామానికి చెందిన ఎస్సీపాలెం దళిత యువకుడు కొండా అశోక్, అదే గ్రామానికి చెందిన బైరెడ్డి సంజీవరెడ్డి మిత్రులు. ఊరి బయట ఉన్న హోటల్ వద్ద తారస పడడంతో సంజీవరెడ్డిని అశోక్ ఏరా బాగున్నావా, ఏం చేస్తున్నావ్.. అని పలకరించాడు. సంజీవరెడ్డి పక్కనే ఉన్న మిగిలిన వారు అరే అని పిలవడం ఏంటని అశోక్‌తో చిన్న పాటి ఘర్షణ పడ్డారు. అంతేకాకుండా అశోక్‌ను కులం పేరుతో దూషించారు. స్థానికులు కలుగజేసుకుని ఇద్దరికి సర్దుబాటు చేసి పంపారు. రాత్రి 10.30 గంటల సమయంలో ఎస్సీపాలెంలోని ప్రజలు నిద్రిస్తున్న సమయంలో సంజీవర్‌రెడ్డి, తమటం సుబ్బారెడ్డి, పాతకోటి అంజిరెడ్డి, బైరెడ్డి చిన్న బసివిరెడ్డితో పాటు మరికొందరు కలిసి అశోక్‌ను ఇంటి నుంచి బయటకు పిలిచి దాడి చేశారు. దీంతో ముక్కు చీలడంతో పాటు తలకు బలమైన గాయాలు కావడంతో వైపాలెంలో వైద్యశాలలో ప్రథమ చికిత్స నిర్వహించి అక్కడి వైద్యులు ఒంగోలుకు రిఫర్ చేశారు.

ఇస్రో విజయం అభినందనీయం



ఇస్రో చైర్మన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు

దర్శి: ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి దిగ్విజయంగా పంపించిన భారత అంతరిక్ష ప్రశోధనా సంస్థ సేవలు అభినందనీయమని మానవత స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని తూర్పు వెంకటాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. విద్యార్థులతో కలిసి విజయోత్సవం జరుపుకున్నారు. జయహో భారత్.. అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. అందరూ మిఠాయిలు పంచుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు ప్రకాశరావు, మానవత సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాద్ పాల్గొన్నారు.

సస్యరక్షణతోనే అధిక దిగుబడులు



పుల్లలచెరువు: పొద్దుతిరుగుడు పంటను పరిశీలిస్తున్న ఏవో నిర్మలాదేవి



ముండ్లమూరు: రైతులకు మందులు అందజేస్తున్న ఏడీఏ బాలాజీనాయక్

పుల్లలచెరువు: రైతులు సాగు చేసిన పంటలకు సస్యరక్షణతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి అన్నారు. బుధవారం మండలంలోని కవలకుంట్ల, నాయుడుపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో కంది, పొద్దుతిరుగుడు పంటలను పరిశీలించి తగు సూచనలు చేశారు. మండలంలో కంది పంటను 6,200 ఎకరాల్లో సాగు చేశారని, ప్రతి ఒక్క రైతు సమీప కేంద్రాల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే రైతు సేవా కేంద్రాల్లో అమ్ముకునేందుకు వీలుగా ఉంటుందన్నారు. పొద్దుతిరుగుడు పంట ప్రస్తుతం పూత దశలో ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. వీఏఏలు పాల్గొన్నారు.

దొనకొండ: ఈ ఏడాది రబీ పంట కాలంలో మొక్కజొన్న విత్తనాలు ఉత్పత్తి చేసే కంపెనీలతో రైతులు ఒప్పందం చేసుకుని అగ్రిమెంట్ కాపీ తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ సూచించారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కొచ్చెర్లకోట రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో సుమారు 100 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని, రైతులు తప్పని సరిగా కంపెనీలతో ఒప్పందం చేసుకుని అగ్రిమెంట్ కాపీ తీసుకోవాలన్నారు. లేకుంటే భవిష్యత్‌లో వచ్చే పరిణామానికి కంపెనీల ప్రతినిధులే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడి, ఎక్కువ ధర ఇస్తామని నోటి మాటలు నమ్మవద్దని, ఏ విషయమైనా అగ్రిమెంట్ బాండ్లలో రాత పూర్వకంగా ఉండాలని చెప్పారు. అనంతరం బసిరెడ్డిపల్లి, కొచ్చెర్లకోట, సిద్ధాయపాలెం గ్రామాల్లో సాగులో ఉన్న మొక్కజొన్న, మినుము, మిరప పంటలను పరిశీలించి రైతులకు సూచన, సలహాలందజేశారు. ఆయన వెంట రైతులు, సిబ్బంది ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ బుధవారం మండల పరిధిలోని ఎగువ చర్లోపల్లి, చిలకచర్లలో పర్యటించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించి మిర్చి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. రైతులకు ఎన్‌పీఎస్ఎస్ యాప్‌లపై అవగాహన కల్పించారు. ఏఈఓ చైతన్యకుమార్, షెడ్రక్‌బాబు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: కందిపై సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి కేవీ శేషారెడ్డి కోరారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని గంజివారిపల్లె, వెంకటాద్రిపాలెం గ్రామల రైతులు పండిస్తున్న కంది, పొగాకు, ఉలవ పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. కందిపై మరుకా మచ్చల పురుగు, గూడు పురుగు ఎక్కువగా ఆశించినట్లు గుర్తించామని, వెంటనే రైతులు ఆ పురుగుల నివారణకు నోవల్యురాన్ 2 మిల్లీ లీటర్ల మందును లీటరు నీటితో పాటు లమ్డా సైపరమేత్రిన్ 1.5 మిల్లీ లీటరు మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకొని పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చని సూచించారు. మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎల్.మాల్యాద్రి, సిబ్బంది మీరావలి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ముండ్లమూరు (దర్శి): లింగాకర్షక బుట్టలతో పురుగు ఉధృతి తగ్గించవచ్చని వ్యవసాయ సహాయ సంచాలకులు కె.బాలాజీనాయక్ సూచించారు. మండలంలోని ముండ్లమూరు, వేంపాడు గ్రామాల్లో ఎఫ్ఎస్ఎస్ పథకం కింద మొక్కజొన్న సాగు చేసే రైతులకు బుధవారం పురుగుమందులు అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీనాయక్ మాట్లాడుతూ రైతులు పొగాకుకు ప్రత్యామ్నాయంగా పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. జొన్న పంటలో లింగాకర్షక బుట్టలు పురుగు ఉధృతిని బాగా తగ్గిస్తాయని చెప్పారు. సబ్సిడీ ద్వారా ప్రభుత్వం అందించే పరికరాలను రైతులు ఉపయోగించుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు టి.శోభారాణి పాల్గొన్నారు.

పశువులకు వైద్య పరీక్షలు



పశుపోషకులకు మందులు ఇస్తున్న వైద్యాధికారి నాగుల్‌మీరా



తాళ్లూరు: నట్టల నివారణ మందు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శివలక్ష్మి

పుల్లలచెరువు: మండలంలోని రెంటపల్లిలో బుధవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించినట్లు డాక్టర్ నాగుల్‌మీరా తెలిపారు. శిబిరంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. లేగ దూడలకు నులిపురుగుల మందును తాపించినట్లు పేర్కొన్నారు. అనారోగ్యంతో ఉన్న పశువులను పరీక్షించి తగిన మందులు ఇచ్చినట్లు తెలిపారు. గర్భకోశ పరీక్షలు, చూడి పరీక్షలు నిర్వహించి అవసరమైన వాటికి మందులు ఇచ్చినట్లు చెప్పారు. సుమారు 15 దూడలకు నులిపురుగల మందును, 3,500 గొర్రెలకు నట్టల నివారణ మందు, 30 అనారోగ్యంగా ఉన్న పశువులకు పరీక్షలు జరిపి మందులు ఇచ్చినట్లు వివరించారు. ఎంపీటీసీ సభ్యుడు గోవింద్, పశు వైద్య సహాయకులు పాల్గొన్నారు.

తాళ్లూరు: మండలంలోని దోసకాయలపాడు రైతుసేవా కేంద్రంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ కోటా శివలక్ష్మి వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని పశుపోషకులు వినియోగించుకోవాలని కోరారు. పశు వైద్యాధికారి ఎం.రాంబాబు మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల రైతులు అవగాహన పెంచుకోవాలని చెప్పారు. జేవీవో మస్తాన్ ఖాన్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కార్యదర్శి ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న శివకోటేశ్వరరావు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని చిన్నదోర్నాల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి పెద్దదోర్నాల మేజర్ పంచాయతీ కార్యదర్శి 20 వేల రూపాయలు అందజేశారు. బుధవారం పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శి నలగాటి శివకోటేశ్వరరావు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మండ్లా శ్రీనివాసులుకు 20 వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మొట్టమొదటి సారిగా తన పోస్టింగ్ చిన్నదోర్నాలలోనే మొదలైందని, గ్రామంలోని పాఠశాలకు తన వంతు సాయంగా నగదు అందజేసినట్లు తెలిపారు. శివకోటేశ్వరరావుకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

రుణాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పొదిలి: బీసీ కార్పొరేషన్ ద్వారా ఓబీఎంఎంఎస్‌లో భాగంగా ఉపాధి రుణాలు పొందేందుకు ఫిబ్రవరి 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. పోర్టల్ ద్వారా చేసుకున్న దరఖాస్తులను 8 నుంచి 11వ తేదీ వరకు పరిశీలిస్తామని, 12 నుంచి 14వ తేదీ వరకు అధికారులు సంయుక్త పరిశీలన చేపడాతారని పేర్కొన్నారు.